## రోడ్డు భద్రత నియమాలపై విద్యార్థులకు అవగాహన



రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**ఆత్మకూర్ ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని ఎం.వి.రామన్ పాఠశాల ఆవరణలో విద్యార్థిని విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలపై ఆత్మకూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ శివకుమార్ అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రాథమిక విద్య మభ్యసిస్తున్న విద్యార్థిని విద్యార్థులు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన పెంచుకోవాలని భవిష్యత్తులో రోడ్డు ప్రమాదాల నివారణకు ఇది ఎంతగానో తోడ్పడుతుందని ఆయన సూచించారు. ప్రస్తుత సమాజంలో మైనర్ బాల బాలికలు వాహనాలు నడుపుతూ పలు ప్రమాదాలకు లోనై ప్రాణాలు పోగొట్టుకోవడమే కాకుండా తల్లిదండ్రులకు విషాదాన్ని మిగిల్చిన ఘటనలను సిఐ శివకుమార్ విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు గాను పోలీసు సిబ్బందితో సహకరిస్తూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని ప్రాణాలను కాపాడేందుకు పోలీస్ సిబ్బంది ఎల్లవేళలా రోడ్డు ప్రమాదాల నివారణ కోసం తగు చర్యలు తీసుకుంటుందని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఎస్సై జయన్న పోలీస్ సిబ్బంది పాఠశాల యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

## కంటి వైద్య శిబిరం విజయవంతం

**డ్రైవర్లకు కంటి పరీక్షలు : సిఐ నాగరాజు**



అవగాహన కల్పిస్తున్న సిఐ నాగరాజు

**అచ్చంపేట, ఏప్రిల్, 16 ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదాల నివారణ వారోత్సవాల్లో భాగంగా డ్రైవర్లకు కంటి పరీక్షలు నర్వహించడం జరిగిందని సిఐ నాగరాజు తెలిపారు. గురువారం పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరం విజయవంతంగా కొనసాగింది. మొత్తం 167 మంది డ్రైవర్లకు పరీక్షలు నిర్వహించడం జరిగిందని సూచించారు. అందులో పదిమందికి కంటిచూపు లోపం ఉన్నట్టు గుర్తించి వారికి చికిత్స అనంతరం కళ్ళ అద్దాలు అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని వాహనాలు నడిపే డ్రైవర్లకు కంటి చూపు సరిగ్గా లేకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజల ప్రాణాలే ప్రాముఖ్యత గా భావించి ఈ కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందన్నారు. అదేవిధంగా వాహనాలు నడిపే డ్రైవర్లు ట్రాపిక్ నియమాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు సద్దాం హుస్సేన్, రాజేందర్, వెంకట్ రెడ్డి, చంద్రశేఖర్ గౌడ్, పోలీస్ సిబ్బంది వాహన డ్రైవర్లు పాల్గొన్నారు.

## సాయిబాబా దేవాలయ వార్షికోత్సవ వేడుకలు

**ఆత్మకూర్ ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని శిరిడి సాయిబాబా దేవాలయ 26వ సంవత్సర వార్షికోత్సవ వేడుకలను గురువారం రోజు ఘనంగా నిర్వహించారు. అమరచింత మాజీ ఎమ్మెల్యే కీర్తిశేషులు కొత్తకోట దయాకర్ రెడ్డి సాయిబాబా దేవాలయానికి ఆనాడు శంకుస్థాపన చేయడమే కాకుండా ఉమ్మడి జిల్లాలోనే సిద్ధ పుణ్యక్షేత్రంగా ఏర్పాటు చేసేందుకు చేసిన కృషిని కొరియాడుతూ దయాకర్ రెడ్డి సతీమణి కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి సాయిబాబా దేవాలయ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిబాబా దేవాలయ ట్రస్ట్ చైర్మన్ గా కొనసాగుతున్న శీతా దయాకర్ రెడ్డి ప్రస్తుతం రాష్ట్ర బాలల హక్కుల చైర్మన్గా కూడా కొనసాగుతున్న విషయం వార్త పాఠకులకు విధితమే. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలుగొంది ఎందుకు చేసిన ప్రయత్నాలను ప్రత్యేకంగా వివరించారు. 26వ వార్షికోత్సవ వేడుకలు పురస్కరించుకొని సాయిబాబా దేవాలయంలో ఉదయం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటుగా సాయిబాబా విగ్రహానికి ప్రత్యేక అలంకరణ చేయడంతో భక్తుల పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా దేవాలయ కమిటీ సభ్యులు ప్రభాకర్ రావు, సూరంపల్లి రమేష్ తదితరులతో పాటుగా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు....

**చదివింది ప్రభుత్వ కళాశాలలోనే.**

## సాధించింది స్టేట్ ర్యాంకు



**991 మార్కులతో స్టేట్ ర్యాంక్ సాధించిన వర్షిత**

**నవాబుపేట, ఏప్రిల్16 ప్రభాతవార్త:** చదివింది ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో అయిన కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా ఇటీవల వెలువడిన ఇంటర్ ఫలితాలలో మండల పరిధిలోని కూచూరు గ్రామానికి చెందిన ఇప్ప వర్షిత మరోసారి తన ప్రతిభతో రాష్ట్ర స్థాయిలో సత్తా చాటింది. గతఏడాది ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ ఎంపిసి విభాగంలో 470 మార్కులకు గాను 467 మార్కులు సాధించి స్టేట్ ర్యాంకర్‌గా నిలిచిన ఆమె, ఈ సంవత్సరం సెకండియర్ పరీక్షల్లో మరింత మెరుగైన ప్రదర్శన కనబరిచి 1000 మార్కులకు గాను 991 మార్కులు సాధించి మరోసారి స్టేట్ ర్యాంక్ సాధించింది. 99.36శాతం మార్కులతో ఆమె సాధించిన ఈ విజయంతో కూచూరు గ్రామం గర్వంతో తలెత్తుకుంది. సాధారణ కుటుంబానికిచెందిన వర్షిత తల్లిదండ్రులు ఇప్పసువర్ణ, ఇప్ప చెన్నయ్యలు కష్టపడి జీవనం సాగిస్తూ తమ కుమార్తె చదువుకు అండగా నిలిచా రు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ విద్యపై ఎప్పుడూ రాజీ పడకుండా, క్రమశిక్షణతో చదువును కొనసాగించిన వర్షిత చిన్ననాటి నుంచే చదువులో ప్రతిభ కనబరుస్తూ ఉపాధ్యాయుల ప్రశంసలు అందుకుంది. వర్షిత సాధించిన ఈఘనతపై గ్రామస్తులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తూ అభినంద నలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి మరెన్నో విజయాలు సాధిస్తూ ఉన్నత చదువులు పూర్తి చేసి మంచి ఉన్నత స్థాయి ఉద్యోగాన్ని ఆమె పొంది గ్రామానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆమె సొంత గ్రామమైన కూచూర్ గ్రామస్తులు తల్లిదండ్రులను విద్యార్థినిని ప్రశంసలతో ముంచెత్తారు.

## జిపిఎఫ్ సమస్యలు పరిష్కరించాలని వినతి

**నారాయణ పేట, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లాలోని ఉపాధ్యాయ ఉద్యోగుల జిపిఎఫ్ ఖాతాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తపస్ నారాయణపేట జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు జెడ్పి సీఈఓ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. జిల్లాలో ఉన్న ప్రతి ఉపాధ్యాయుని జిపిఎఫ్ ఖాతాను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వివరాలు అందుబాటులో ఉంచాలని కోరారు. అలాగే ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులకు ఫైనల్ పేమెంట్లు, పార్ట్ ఫైనల్ డబ్బులు ఆలస్యం కాకుండా వేగవంతంగా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సీఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు పొదుపు చేసిన డబ్బుల వివరాలను స్పష్టంగా నమోదు చేసి, పారదర్శకంగా అందుబాటులో ఉంచడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. జిపిఎఫ్ ఖాతాల ఆన్‌లైన్ ప్రక్రియను ఒక నెలలోపు పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేయాలని అందరి సమక్షంలో హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షులు నరసింహ, కోశాధికారి కిషోర్ కుమార్, జిల్లా సహా కోశాధికారి శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి చిన్న నరసింహ, నగర అధ్యక్షులు అశోక్ రెడ్డి, మండల నాయకులు విశ్వేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సీఈఓకు సంఘం నాయకులు డైరీ అందించి స్వాగతం పలికారు.
16ఎంబిఎన్ఆర్ 16: జడ్పీ సీఈఓకు వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

## ఇంటిగ్రేటెడ్ పాఠశాల స్థల మార్పు చేయాలి



స్థల మార్పుపై సంతకాల సేకరణ చేస్తున్న బిఆర్ఎస్ నేతలు

**చిన్న చింతకుంట, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** మండలంలోని దమగ్నాపూర్ గ్రామ సమీపంలో చేపట్టనున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ స్థలాన్ని మార్పు చేయాలని ప్రధాన డిమాండ్‌తో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పార్టీ మండల అధ్యక్షులు కోటా రాము తెలిపారు. గురువారం మండలంలో పర్ది పూర్, నెల్లికొండి గ్రామంలో ప్రజలతో అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ఇంతనాల్ కెమికల్ ఫ్యాక్టరీ నుండి వచ్చే చెడు రసాయనాలను పీలుస్తూ అనారోగ్యాల భారీన పడుతున్నారన్నారు. పాఠశాల నిర్మాణం చేస్తే పిల్లల భవిష్యత్తు అంధకారంలో వెళ్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యావేత్త సామజిక అవగాహన ఉన్న శాసన సభ్యులు ఈ స్థలం విషయంలో పునః పరిశీలన చేయాలని ప్రజల అభిప్రాయాన్ని గౌరవించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ మండల పార్టీ నాయకులు రాము, సంతోష్ రెడ్డి, గ్రామ బిఆర్ ఎస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, స్వామి, చర్ల పల్లి గోవిందు, కెసిఆర్ నర్సింహా, తెలుగు నర్సింహా, పెద్ద బాల్ రాజు గౌడ్, చాకలి శంకర్, వార్డు సభ్యులు దాసరి వేణు, పూజరి బుచప్ప, గ్రామ ఉపాధ్యక్షులు ఎర్రన్న, ఎస్సీ సెల్ అధ్యక్షులు బిక్కి మైబు, సాయిలు, చిన్నయ్య గౌడ్, శాంసన్, రవి, ప్రకాష్, వెంకటేష్, రమేష్, నర్సింహా, చెన్నప్ప, రాములు గౌడ్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలు ప్రతి మహిళకు లబ్ధి పొందేలా కృషి

**మహిళలు తీసుకున్న రుణాలపై జిల్లాలో రూ.28కోట్లు వడ్డీ జమ : డిఆర్‌డిఓ పిడి చిన్న ఓబులేష్**



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌డిఓ పిడి చిన్న ఓబులేష్



సమావేశానికి హాజరైన సర్పంచులు,ఉప సర్పంచులు, వార్డు సభ్యులు

**ఉప్పునుంతల, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** జిల్లాలో మహిళలు బ్యాంకు లింకేజీ ద్వారా తీసుకున్న రుణాలపై రూ. 28 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం జమ చేయడం జరిగిందని, ప్రతి మహిళకు లబ్ధి పొందెలా కృషి చేస్తున్నామని డిఆర్‌డిఓ పిడి చిన్న ఓబులేష్ అన్నారు. గురువారం ఎంపిడిఓ రేవత్ రెడ్డి అధ్యక్షతన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జరిగిన మండల స్థాయి సమావేశానికి డిఆర్‌డిఓ పిడి చిన్న ఓబులేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశానికి ముందు తెలంగాణ రాష్ట్ర గీతం, అనంతరం ముఖ్యమంత్రి సందేశాన్ని ఇంఛార్జి మండల పంచాయతీ అధికారి అల్లాజీ చదివి వినిపించారు. తదుపరి జరిగిన సమావేశంలో డిఆర్‌డిఓ పిడి చిన్న ఓబులేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు, మహిళలకు, వృద్ధులకు అందేలా గ్రామస్థాయిలో సర్పంచులు పూర్తి సహకారం అందించాలని సూచించారు. ముఖ్యంగా వయోవృద్ధులైన మహిళలకు పింఛన్ సౌకర్యం, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, ఉచిత సన్న బియ్యం లాంటి పథకాలు అనేక సంక్షేమ పథకాలు గ్రామస్థాయిలో సర్పంచులు ఒక నివేదిక ద్వారా ప్రజలకు అందేలా చూడాలని ఆయన కోరారు ఇందిరా కాంతి పథకం కింద మహిళలకు పథకాలు అందేలా చూడాలని సర్పంచులను కోరారు. స్వయం సహాయక సంఘాలకు గ్రామపంచాయతీ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, విఓల ద్వారా మిగిలిన ప్రతి మహిళకు లబ్ధి చేకూరేలా కృషి చేయాల్సిన అవసరం సర్పంచులపై ఉందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలపై సమీక్ష నిర్వహించారు. మండలంలో ప్రజలు కుక్కకాటు వేసినా వెంటనే ప్రభుత్వ వైద్యశాలను సంప్రదించాలని, నిరక్ష్యం చేస్తే ప్రాణ అని ఉంటుందని, సత్వరమే కుక్క కాటుకు యాక్షన్ తీసుకోవాలని వైద్య అధికారిణి డా. స్వప్న వివరించారు. సర్పంచులకు అవగాహన కల్పిస్తూ అందర్నీ ఆశ్చర్యపరిచింది. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, మా లక్ష్మి పథకం, గృహ జ్యోతి, రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి సన్న బియ్యం, సన్న రకం వరికి బోనస్, చేయూత, కళ్యాణ్ లక్ష్మి, ఇంద్ర మహిళా శక్తి, వడ్డీ లేని రుణాలు, కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఓ పిడి చిన్న ఓబులేష్, ఎంపిడిఓ రేవత్ రెడ్డి, తహసీల్దార్ అద్దంకి సునీత, ఉప తహసీల్దార్ రమేష్ నాయక్, మండల పంచాయతీ అధికారి అల్లాజీ, మండల విద్యా శాఖాధికారి చంద్ర శేఖర్, సిహెచ్‌సి సూపరింటెండెంట్ డా. వాణి, వైద్య అధికారిణి డా. స్వప్న, ఎస్సై వెంకట్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్, పశు వైద్య అధికారి డా. ప్రవీణ్ కుమార్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ బిపాసా, పావని, ఎఇలు కొండల్, సాయికృష్ణ, మహేష్, వెంకటే ష్ ,అంజనమ్మ, ఐకెపి ఎపిఎం బాలచందర్, ఈజీఎస్ ఏపీఓ పర్వతాలు, అన్ని గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వార్డు సభ్యులు, అన్ని శాఖల అధికారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరించండి ప్రాణాలు కాపాడుకోండి

**తెలంగాణ డిజిపి శివధర్ రెడ్డి**

**ఎస్పీ జానకి, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిలతో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ల పంపిణీ**



ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

**బాలానగర్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్లు ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని తెలంగాణ రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు బాలానగర్ మండల పరిధిలోని పెద్దాయపల్లి చౌరస్తాలో గురువారం అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ జానకి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డిలతో కలిసి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాల్సిందే అని స్పష్టం చేశారు. కొందరు వాహనదారులు సాధారణంగా హెల్మెట్ పెట్టుకుని, హెల్మెట్ క్లిప్పు పెట్టుకోకపోవడంతో రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు, హెల్మెట్ ఎగిరిపోయి తలకు తీవ్ర గాయాలయి చనిపోతున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడాదిలో జరిగే గొడవలలో 800 మంది హత్యకు గురవగా, 7500 మంది రోడ్డు ప్రమాదాలలో చనిపోవడం జరుగుతుందన్నారు. కార్లలో ప్రయాణించే వాహనదారులు తప్పనిసరిగా సీటు బెల్టు ధరించాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి, గద్వాల రేంజ్ డీఐజీ ఎల్ ఎస్ చౌహాన్, జిల్లా ఎస్పీ జానకిలతో కలిసి ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వాహనదారులు పాల్గొన్నారు.

## ప్రజాపాలనతో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

**మండల స్థాయి సమావేశంలో ఎంపీడీఓ**



మండల సభ నిర్వహిస్తున్న నాయకులు

**నవాబుపేట, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో అర్హులైన పేదలఅందరికీ పథకాలు లబ్ధిదారులకు చేరవేయడమే మండల సభ ప్రధాన లక్ష్యమని మండల అధికారులు ఎంపీడీవో జయరాం నాయక్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం నవాబుపేట మండల కార్యాలయం ఆవరణలో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా గ్రామస్థాయిలో సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కారం చూపే దిశగా అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని, ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

**మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి:** తాగునీరు, రహదారులు, విద్యుత్ వంటి మౌలిక వసతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ప్రజల విజ్ఞప్తులను ప్రాధాన్యంగా తీసుకుని నిర్ణీత కాలంలో పరిష్కారం చూపాలని సూచించారు.

**ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహం:** ప్రతి గ్రామంలో కనీసం పది మంది రైతులతో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. మహిళా సంఘాల బలోపేతం.

**మహిళా సంఘాల బలోపేతం:** స్వయం ఉపాధి అవకాశాల పెంపులో ప్రభుత్వ సహకారం కీలకమని వివరించారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లతో భద్రతతో జీవనం. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు మాట్లాడుతూ ఈ పథకం ద్వారా తమకు స్థిర నివాసం లభించిందని సంతోషం వ్యక్తం చేశారు. అప్పుడైనా ఇప్పుడైనా ఎప్పుడైనా పేదల పక్షాన ఉండి వారి అవసరాలు తీర్చే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని లబ్ధిదారులు కొనియాడారు. గృహ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించిందని తెలిపారు. అలాగేప్రభుత్వం కొత్తగా ప్రవేశపెడుతున్న కళాశాల విద్యార్థులకు భోజన వసతి, అల్పాహారం, పై అవగాహన నిర్వహించారు. గ్యాస్ సబ్సిడీ, ఉచిత కరెంటు, ఇందిరమ్మ ఇండ్లు, కల్యాణ లక్ష్మి, షాదిముబారక్, తులంబంగారం, ఉచిత బస్సు, ఉచిత కరెంటు, రైతు బీమా రైతు భరోసా పథకాల అవగాహన నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి మండల వ్యాప్తంగా గ్రామాల సర్పంచులు మండల అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## హామీలు నెరవేర్చేందుకు అధికారులు సహకరించండి : సర్పంచ్‌లు

**అధికారులు సర్పంచుల ప్రమేయం లేకుండా పని చేస్తున్నారని**

**జనాభా ప్రాతిపదికన పనులు కేటాయించాలని మండల**

**స్థాయి సమావేశంలో ఏ కరువు పెట్టుకున్న సర్పంచులు**



హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు ను నిలదీస్తున్న పెనిమిళ్ళ సర్పంచ్ మేడసాని శ్రీలత విజేందర్ రెడ్డి

**ఉప్పునుంతల, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** ఎన్నికల సమయంలో తమ ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు అధికారులు సహకరించడం లేదని, సర్పంచుల ప్రమేయం లేకుండా ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియ కొనసాగుతుందని దాసర్లపల్లి ఉపసర్పంచ్ శంకర్, పెనిమిళ్ళ సర్పంచ్ మేడసాని శ్రీలత విజేందర్ రెడ్డి హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు ను నిలదీశారు. స్పందించిన డిఆర్‌డిఓ పిడి చిన్న ఓబులేష్ సర్పంచులకు సమాధానం ఇస్తూ ప్రతి కార్యక్రమంలో సర్పంచులు కీలకమని, ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక ప్రక్రియ కమిటీలో సర్పంచులు చైర్పర్సన్‌గా ఉంటారని వారికి సంజాయిషీ ఇచ్చారు. గ్రామాలలో నెలకొన్న విద్యుత్ సమస్య, మంచినీటి సౌకర్యం కల్పించాలని సర్పంచులు సమావేశంలో వారి ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు సంవత్సరాల కాలం ప్రత్యేక అధికారుల పాలన కొనసాగింది ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా ఉందని, నేను గెలిచిన వంద రోజుల్లో గ్రామంలో జెసిబి యంత్రాల ద్వారా మురికి కంప చెట్ల తొలగింపు, ఎన్నో పనులు చేశామని అట్టి పనులకు అధికారులు రికార్డు చేసి సర్పంచులకు న్యాయం చేయాలని ఉప్పునుంతల సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు సమావేశంలో డిఆర్‌డిఓ పిడి చిన్న ఓబులేష్ ముందు వాపోయారు. ఎన్నో సంవత్సరాలుగా పేరుకుపోయిన సమస్యలను మూడు నెలలలో పూర్తి చేశామని, ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన పనులు కేటాయించాలని 500ల జనాభా ఉన్న గ్రామాలకు 20 పనులు, 5 వేల జనాభా కలిగిన గ్రామానికి 20 పనులు కేటాయించడం సరికాదని ఉప్పునుంతల సర్పంచు శ్రీనివాసులు అధికారులను నిలదీశారు. గ్రామాలలో సర్పంచులకు తెలియకుండా అధికారులు పనిచేస్తే చూస్తూ ఊరుకోమని సర్పంచులు సమావేశంలో అధికారులకు హెచ్చరించారు. తమ గ్రామంలో ఎన్నికల సమయంలో గెలిచిన వెంటనే ఇందిరమ్మ ఇండ్ల పథకం 50 ఇళ్లు నిర్మిస్తామని ఎమ్మెల్యే సాక్షిగా ప్రజలకు హామీ ఇచ్చామని పెనిమిళ్ళ గ్రామ సర్పంచ్ మెడ సాని శ్రీలత విజేందర్ రెడ్డి హౌసింగ్ ఏఈ వెంకటేష్ దృష్టి కి తీసుకెళ్ళారు. అదే విధంగా పెనిమిళ్ళ మీదుగా హైదరాబాద్ కు అచ్చంపేట ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చి నెలలు గడుస్తున్న కార్యరూపం దాల్చలేదని సత్వరమే బస్సు సౌకర్యం కల్పించాలని అధికారుల ముందు వాపోయారు. అనంతరం గ్రామ సర్పంచులు, అధికారుల మధ్య పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశారు. తమ గ్రామాలలో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకెళ్లడానికి సర్పంచులు ముందుకెళ్తుండగా మరొకసారి సమయం తీసుకొని ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి గ్రామాల వారిగా సమస్యలను అడిగి తెలుసుకుంటమని ఎంపిడిఓ రేవత్ రెడ్డి సర్పంచ్ లను సముదాయించారు.

## అంబలి కేంద్ర నిర్వాహకులను అభినందించిన సీఐ

**అచ్చంపేట, ఏప్రిల్, 16 ప్రభాతవార్త:** రక్షిత మహిళా సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంబలి కేంద్ర నిర్వాహకులను అచ్చంపేట సిఐ నాగరాజు అభినందించారు. గురువారం ఆయన అంబలి కేంద్రాన్ని సందర్శించి వారు చేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం సిఐ నాగరాజు మాట్లాడుతూ అచ్చంపేట పట్టణంలో అంబేద్కర్ కూడలి వద్ద ఏర్పాటుచేసిన రక్షిత మహిళా సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఈ అంబలి కేంద్రం నిర్వహించడం పరిపాటిగా వస్తుంది. వేసవికాలం మండుటెండలో వివిధ మండలాల నుండి విచ్చేస్తున్న ప్రజలకు వారు అంబలి పోసి ఆదరణ పొందుతున్నారని సీఐ నాగరాజు వారిని అభినందించారు. ప్రజలు ప్రతి ఒక్కరూ సేవా భావం పెంపొందించుకోవాలని ఒకరికి ఒకరు సహాయపడుతూ జీవితం సాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రక్షిత మహిళా సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని శవం లభ్యం



**అచ్చంపేట, ఏప్రిల్,16 ప్రభాతవార్త:** బల్మూరు మండల పరిధిలోని పొలిసెట్టిపల్లి గ్రామ శివారులో ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలిశెట్టిపల్లి శివారులో జిఎస్ ఎన్ కాలేజీ సమీపంలో సుమారు 70 ఏళ్ల వయసుగల గుర్తుతెలియని వృద్ధుడు మరణించి ఉండడాన్ని గమనించిన ఆ గ్రామ వాసి ఆకారపు పరమేష్ బల్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఘటన స్థలానికి పోలీసులు చేరుకున్నారు. మృతుడు తెలుపు రంగు బనియన్ నీలపు రంగు షర్టు ధరించి ఉన్నాడని పిక్షాటన చేసి జీవించే వాడని తెలుస్తుందని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి సంబంధించిన వివరాలు ఎవరికైనా తెలిసినట్లయితే వెంటనే బల్మూరు ఎస్సై రాజేందర్ ఫోన్ 8712657736కి తెలపాలని సూచించారు.

**18న బీడీ కూలి పెంపుపై**

## యజమాన్యాలతో చర్చలు

**చిన్నచింతకుంట, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** రెండు సంవత్సరాలకు ఒక్కసారి కొత్త వేతన ఒప్పందం జరిగే పద్ధతి బీడీ యాజమాన్యాలతో చర్చలు జరుగుతాయి. ఇందులో భాగంగానే మార్చి 12న తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (టియుసిఐ) ఆధ్వర్యంలో 1000 బీడీలకు రూ .400 వేతనం పెంచాలని డిమాండ్ నోటీస్ ఇవ్వడం జరిగిందని తెలంగాణ ప్రగతిశీల బ్యూటీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి దేవదానం తెలిపారు. కార్మికుల పిఎఫ్ , గ్రాటివిటీ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేయడం జరిగిందన్నారు. ఈ డిమాండ్‌తో పాటు అన్ని కార్మిక సంఘాలు కూడా రూ.400ల బీడీ కూలి పెంపు చేయాలని డిమాండు చేయడం జరిగిందన్నారు. బీడీ యాజమాన్యాలతో ఈనెల 18న మహబూబ్‌నగర్ హిమాలయ ఫ్యామిలీ రెస్టారెంట్‌లో మధ్యాహ్నం 3గంటలకు చర్చలకు రావాలని బీడీ యాజమాన్యాలు ఆహ్వానించడం జరిగింది అన్నారు. ఈ చర్చలకు సంఘ ప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

## మండలంలో చలివేంద్రం ప్రారంభం




చలివేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

**నవాబుపేట, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో వేసవిలో ప్రజలు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుక మండల తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో మండల కార్యాలయ ప్రాంగణంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రయాణికులు, బాటసారులు ఈ వేసవి ఎండల వల్ల ప్రజలు డిహైడ్రేషన్ కి లోను కాకుండా చలివేంద్రాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండలఇంచార్జ్ తహసిల్దార్ సువర్ణ, ఎంపీడీవో జయరాం నాయక్ ఎంపీఓ బద్రు, ఆర్ఐ రామాంజనేయులు, ఆర్ఐ గాయత్రి, జూనియర్ అసిస్టెంట్లు, మండల కార్యాలయ సిబ్బంది, బిజెపి నాయకులు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

**ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో**

## మండల సభా సమావేశం



మండల సమావేశంలో పాల్గొన్న నాయకులు, ప్రజా ప్రతినిధులు

**బాలానగర్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** బాలానగర్ మండలంలోని పెద్దాయపల్లి శివారులోని రైతు వేదికలో గురువారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మండల సభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల చెందిన అధికారులు, ఆయాశాఖలో జరుగుతున్న సంక్షేమపథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. వివిధ శాఖలలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు, ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో అనిల్ కుమార్ రెడ్డి, ఎంఈఓ శంకర్‌నాయక్, ఎంపీఓ విజయ కుమారి, పశు వైద్యులు రఘురాం, ఏపీఎం తిరుపతయ్య, విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్, వ్యవసాయ అధికారి సుజాత, శిశు సంక్షేమ శాఖ అధికారి రాజా రాజేశ్వరి, మండలంలోని వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడి చదివితే సాధించలేనిది ఏది లేదు

**నవోదయలో సీటు సాధించిన హాని దీపను సన్మానించిన ఎంఈఓ పి.ఇమాన్యుయల్**



హాని దీప ను సన్మానించిన ఎంఈఓ పి.ఇమాన్యుయల్

**కొల్లాపూర్, ఏప్రిల్16, ప్రభాతవార్త :** కొల్లాపూర్ మండలం లచ్చనాయక్ తండాకు చెందిన సీతారాం కుమార్తె హనీ దీప ఇటీవల వెలువడిన నవోదయ విద్యాలయ సమితి ప్రవేశ పరీక్షా ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి సీటు సాధించింది. ఈ గొప్ప విజయాన్ని పురస్కరించుకొని, ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గిరిజన ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హనీ దీప ను ఉపాధ్యాయులు ఆమె తల్లిదండ్రులను ఎంఈఓ పి ఇమాన్యుల్ అభినందించి ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు సరైన పట్టుదలతో ఉంటే నవోదయ వంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో సీట్లు సాధించవచ్చని హనీ దీప నిరూపించింది. గిరిజన బిడ్డలు చదువులో రాణించడం గర్వకారణం అని ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ నవోదయ విద్యాలయ సమితిలో సీటు సాధించడం కొల్లాపూర్ నియోజకవర్గంలోని విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుంది అని ఈ సందర్భంగా తెలియజేశారు.

## ధన్వాడలో వెలగని హైమస్ట్ లైట్లు..?

**ధన్వాడ ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** ధన్వాడ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన హైమస్ట్ లైట్లు గత కొన్ని నెలలుగా వెలగకపోవడం పై బిఆర్ఎస్ యువ నాయకుడు కురువ నవీన్ ఆందోళన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని ప్రధాన ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన హైమస్ట్ లైట్ స్తంభాలు ప్రస్తుతం అలంకారప్రాయంగా మారాయని ఆయన విమర్శించారు. ప్రజల రాత్రి ప్రయాణాలకు ఉపయోగపడాల్సిన ఈ లైట్లు పనిచేయకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ విద్యుత్ శాఖ అధికారులు మరియు గ్రామ పంచాయతీ పాలకులు ఈ సమస్యను పట్టించుకోకుండా చూస్తూ ఉన్నారని ఆయన ఆరోపించారు. అలాగే గౌరవ ఎంపీ పక్క గ్రామాల్లో హైమస్ట్ లైట్లు ఏర్పాటు చేయడానికి నిధులు వినియోగిస్తున్నప్పుడు, సొంత మండల కేంద్రంలో ఉన్న లైట్లు మరమ్మత్తు చేసి వెలిగించడానికి నిధులు లేవా అని ప్రశ్నించారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని తక్షణమే స్పందించి హైమస్ట్ లైట్లు పునరుద్ధరించాలని, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ తరఫున కురువ నవీన్ డిమాండ్ చేశారు.

## సందేశాన్ని అడ్డుకున్న బిఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు



సందేశాన్ని అడ్డుకుంటున్న బిఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు

**ఖిల్లా గణపురం ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** మండల స్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి సందేశాన్ని అడ్డుకున్న టిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు మండల కేంద్రంలో ని రైతు వేదిక లో గురువారం 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మండల స్థాయి సభ ను మండల ప్రత్యేక అధికారి అంజయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గత బిఆర్ఎస్ ప్రభుత్వం 10 ఏళ్ల కాలంలో అనేక అభివృద్ధి పథకాలను అడ్డుకున్నదని అధికారులు చదువుతుండగా అప్పారెడ్డిపల్లి సర్పంచ్ నాగన్న గణపురం వార్డు సభ్యుడు ఆంజనేయులు గౌడ్ మాన్య నాయక్ పలువురు టిఆర్ఎస్ నాయకులు ముఖ్యమంత్రి సందేశాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు తెలంగాణ రాష్ట్రాన్ని సాధించింది. కేసీఆర్ అని పెన్షన్ల పెంపుతో పాటు రైతు పెట్టుబడి కళ్యాణ లక్ష్మి ్మ షాదీ ముబారక్ రైతు బీమా ఉచిత విద్యుత్తుతో పాటు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారని అన్నారు. గత ప్రభుత్వం గురించి విమర్శలు చేయకుండా ఈ ప్రభుత్వం ఏ పథకాలు చేపట్టి ప్రజలకు మేలు చేసిందో చెప్పాలని సూచించారు. అనంతరం అధికా రులు తమ శాఖ వారిగా ఇందిరమ్మ ఇల్లు ఉచిత విద్యుత్తు రైతు పెట్టుబడి తో పాటు సన్నవ డ్లకు బోనస్ మహిళలకు చీరలు వ్యవసాయానికి ఎరువుల సరఫరాతో పాటు రెండున్నర సంవత్సరాలలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో తహసి ల్దార్ సుగుణ ఇంచార్జ్ ఎంపీడీవో సునీత, పలు గ్రామాల సర్పంచులు ఉపసర్పంచులు వార్డు సభ్య లు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఈనెల 25న ఒక్కరోజు వర్క్ షాప్

**పోస్టర్ ఆవిష్కరించిన పియు విసి, రిజిస్ట్రార్**

**మహబూబ్‌నగర్ ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** క్లూ 4 ఎవిడెన్స్ సంస్థ, పాలమూరు విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 25న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఒకరోజు వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు పాలమూరు విశ్వవిద్యాలయంలో గురువారం ఉపకులపతి ప్రొ॥ జిఎన్. శ్రీనివాస్, రిజిస్ట్రార్ పాలమూరు విశ్వవిద్యాలయం ప్రొ॥పి. రమేష్ బాబు పోస్టర్ ను ఆవిష్కరించారు. ప్రొ॥ జి.ఎన్. శ్రీనివాస్ మాట్లాడుతూ క్లూ 4 ఎవిడెన్స్ సంస్థ ద్వారా పాలమూరు విశ్వవిద్యాలయం న్యాయ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు మాక్ డెమోనిస్ట్రేషన్, వివిధ కేసులలో ఫోరెన్సిక్ పరిశోధన ఏ విధంగా చేయాలి, ఫోర్ ఎన్సిక్స్ సైన్స్ అండ్ లీగల్ అప్లికేషన్స్, పరిశోధన రుజువుపై చర్చిస్తామన్నారు. ఈ వర్క్ షాప్ కి మిస్టర్ ఫణిందర్ డైరెక్టర్ క్లూ ఫోర్ సంస్థ కోర్టు కమిషన్ ఎక్స్పర్ట్ హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో పాలమూరు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొ॥ పి. రమేష్ బాబు, న్యాయ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. వి. భూమయ్య, న్యాయ కళాశాల హెచ్ఓడి, రాధా కృష్ణ, కన్వీనర్ వెంకట సాయి ప్రసాద్, అశోక్, ప్రియాంక జగదీష్ పాల్గొన్నారు.

## బీజేపీ ఎంపీ తేజస్వి సూర్యని బర్తరఫ్ చెయాలి

**మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ డా. కొడుగల్ యాదయ్య**

**జడ్చర్ల, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** పార్లమెంటులో బిజెపి ఎంపీ తేజస్విసూర్య మాట్లాడుచు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయడం అన్యాయమని, తెలంగాణను ఆంధ్ర ను విడదీయడం పాకిస్తాన్ ఇండియాతో పోల్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. తేజస్వి సూర్య పార్లమెంట్ లో మాట్లాడిన మాటలకు తెలంగాణ ప్రజల మనోభావాలు దెబ్బ తిన్నాయన్నారు. పార్లమెంట్‌లోని 8మంది బీజేపీ ఎంపీలు గాని కాంగ్రెస్ ఎంపీలు గాని ఎవ్వరు మాట్లాడక పోవడం సిగ్గు చేటన్నారు. తెలంగాణ ప్రజలు దశాబ్ద కాలం పోరాటం చేసి సాధించుకున్న రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవం దెబ్బతీయడం జరిగిందని, పార్లమెంట్ సాక్షి గా తేజస్వి సూర్య మాట్లాడిన మాటలు తొలగించాలని కోడుగల్ యాదయ్య డిమాండ్ చేశారు.

## లీగల్ సర్వీసెస్ పై అవగాహన ఉండాలి


**మహబూబ్‌నగర్ జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డి.ఇందిర**

**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** విద్యార్థులకు న్యాయ హక్కులు, బాధ్యతలు, ఉచిత తప్పనిసరి విద్య హక్కు చట్టం, బాల కార్మిక నిషేధం, మానవ అక్రమ రవాణా (ట్రాఫికింగ్), ట్రాఫిక్ రూల్స్, లీగల్ సర్వీసెస్ యాక్ట్ వంటి ముఖ్యమైన అంశాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఇందిర అన్నారు. రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ, చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు గురువారం ఎదిరలోని మహాత్మా జ్యోతి పూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యాయంపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా తమ హక్కులను కాపాడుకోవాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీదేవి పాల్గొన్నారు.

## బ్లూ కోల్ట్ సిబ్బంది సేవలు భేష్

**అత్యవసర పరిస్థితుల్లో కీలక విధులు**

**హెల్మెట్లు పంపిణీ చేసిన జిల్లా ఎస్పీ డి.జానకి**



హెల్మెట్లు అందజేస్తున్న జిల్లా ఎస్పీ డి.జానకి

**మహబూబ్‌నగర్ క్రైమ్, ఏప్రిల్16, ప్రభాతవార్త :** బ్లూ కోల్ట్ సిబ్బంది బాధ్యతలు కేవలం కాల్స్ కు స్పందించడం మాత్రమే కాకుండా, ప్రమాద స్థలాలకు తక్షణం చేరుకోవడం, చట్టం శాంతి భద్రతల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సహాయం చేయడం వంటి కీలక విధులను నిర్వర్తిస్తారని మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి ధరావత్ కొనియాడారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా, మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం కవాతు మైదానంలో ఎస్పీ డి. జానకి ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పనిచేస్తున్న బ్లూ కోల్ట్ సిబ్బందికి హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బ్లూ కోల్ట్ సిబ్బంది అత్యవసర సేవలలో కీలక పాత్ర పోషిస్తూ, 100 కాల్స్ కు తక్షణ స్పందన అందిస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఈ విధులలో భాగంగా వారు ఎక్కువగా ద్విచక్ర వాహనాలపై వేగంగా ప్రయాణించాల్సి వస్తుందని, అందువల్ల ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్‌బి రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణా రెడ్డి, ఆర్ఐలు కృష్ణయ్య, నగేష్, అశోక్ కుమార్ తదితర అధికారులు బ్లూ కోల్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రగతి ప్రణాళికలో ప్రజాప్రతినిధులు కీలకం

**ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం : అడిషనల్ కలెక్టర్ కె.వినోద్**



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ కె.వినోద్

**మదనాపురం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** ప్రగతి ప్రణాళిక ప్రజాప్రతినిధులు అధికారులు కీలకం అని అడిషనల్ కలెక్టర్ కె.వినోద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో పని చేసి 99 రోజుల కార్యాచరణతో సత్ఫలితాలు సాధించాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రభుత్వం ప్రజలకు మరింత మేలైన పాలన అందించాలనే లక్ష్యంతో ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దానిలో భాగంగా నిర్వహించిన మండల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశంలో ప్రజాప్రతినిధులకు, అధికారులకు దిశానిర్దేశం చేయడం జరిగింది. 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించే ప్రతి కార్యక్రమాలను అధికారులు అంకిత భావంతో పని చేసి విజయవంతం చేయాలి. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి, ప్రజాపాలన పట్టణ ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో పారిశుద్ధ్యం, ఫైళ్ల క్లియరెన్స్, ఆరోగ్యం, అరైవ్ అలైవ్ (రోడ్డు భద్రత), సంక్షేమం, పిల్లల రక్షణ, డ్రగ్స్ నిర్మూలన, రైతు సంక్షేమం, వ్యవసాయం, విద్య, యువత, క్రీడలు, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. ముఖ్యంగా విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో అధికారులు మరింత శ్రద్ధ వహించి ప్రభుత్వ ఆలోచనలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి, ప్రజాప్రతినిధుల సహకారంతో స్థానికంగా చేయవలసిన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను అందజేస్తే, ప్రాధాన్యత ఆధారంగా ప్రభుత్వం నిధులను కేటాయించడానికి సిద్ధంగా ఉంది. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ప్రశాంత్, మండల స్పెషల్ ఆఫీసర్ ఎండి సిరాజుద్దీన్, ఎంపిడిఓ ప్రసన్నకుమారి, తహాశీల్దార్ రాజు, ఎస్సై జగదీశ్వర్, సర్పంచులు శారద రామకృష్ణ, ఆఫ్రిన్ బేగం, అంజద్ అలీ, నాగరాజు గౌడ్, రామచంద్రయ్య, సుజాత నాగరాజు, మల్లేష్, రానూల్ భీగూడాషా, రాజేష్, పల్లవి వెంకటేష్, ఆంజనేయులు, అంజలమ్మ, లక్ష్మినారాయణ, శివ నాయక్, బాబునాయక్, సీతారాం నాయక్, మండల నాయకులు మహేష్, జగదీష్, మహదేవన్‌గౌడ్, సాయిబాబా, వెంకటయ్య, శ్రావణ్ కుమార్, పల్లెపాగ సురేష్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ అసత్య ప్రచారాలు చేస్తే సహించేది లేదు

**- వంగూరులో బిఆర్ఎస్ డ్రామాలు సాగవు**

**- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చీమ్ముల రాజశేఖర్ రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న చీమ్ముల రాజశేఖర్ రెడ్డి

**వంగూరు, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** మండలంలో ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని బిఆర్ఎస్ నాయకులు చేస్తున్న విమర్శలు కేవలం రాజకీయ ఉనికి కోసమేనని, అవి అవాస్తవాలని వంగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిమ్ముల రాజశేఖర్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. గురువారం వంగూరు మండల నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇసుక అక్రమ రవాణా ఎక్కడ జరుగుతుందో బిఆర్ఎస్ నేతలు ఆధారాలతో సహా నిరూపించాలని, గాలి మాటలు మాట్లాడి ప్రజలను గందరగోళానికి గురిచేయవద్దని అయన పేర్కొన్నారు. పదేళ్ల పాలనలో సహజ వనరులను ఇష్టారాజ్యంగా దోచుకున్న చరిత్ర బిఆర్ఎస్‌దేనని ఇసుక మాఫియాను పెంచి పోషించిన వారు నేడు పారదర్శకమైన కాంగ్రెస్ పాలనపై విమర్శలు చేయడం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మండలంలో చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను చూసి ఓర్వలేకనే ఇటువంటి చౌకబారు ఆరోపణలు చేస్తున్నారని అయన విమర్శించారు. రాబోయే రోజుల్లో మండల అభివృద్ధి కోసం అవసరమైన నిధులను ఇవ్వడానికి సీఎం రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని, ఎవ్వరూ కూడా ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని కాంగ్రెస్ మండల నాయకులు స్పష్టం చేశారు. అబద్ధపు ప్రచారాలతో మండల వాతావరణాన్ని చెడగొట్టాలని చూస్తే ఊరుకోబోమని, అసత్యాలు ప్రచారం చేసే వారిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యకర్తల ఆగ్రహానికి గురికాకముందే జాగ్రత్తగా ఉండాలని, రాజకీయ లబ్ధి కోసం కార్యకర్తలను, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తే వంగూరు మండల కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోబోదని రాజశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. వెంటనే తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, లేదంటే గ్రామాల వారీగా బిఆర్ఎస్ అబద్ధాలను ఎండగడతామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి పులిజాల కృష్ణ రెడ్డి, జిల్లా కార్యదర్శి యాదగిరి రావు, మండల వర్కింగ్ ప్రసిడెంట్ రమేష్ గౌడ్, మాజీ జిల్లా కో ఆప్షన్ మెంబెర్ హమీద్, మహేష్, శేఖర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు చంద్రశేఖర్, సర్పంచ్‌లు యాదయ్య, మల్లయ్య, మండల స్థాయి నాయకులు పరుశరాములు, సతీష్ రెడ్డి, శంకర్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై మండల స్థాయి సభ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

**వీపనగండ్ల ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పై మండల స్థాయి సభ గురువారం నాడు మండల కేంద్రంలోని రైతు వేదికలో జరిగింది. ఈ సమావేశానికి 14 గ్రామపంచాయతీల సర్పంచులు అంగన్వాడి వర్కర్స్ ఆశా వర్కర్లు వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు తదితరులు హాజరై సమావేశంలో ప్రభుత్వ పథకాలపై ప్రజలకు వివరించాలని వారికి తెలియజేశారు. గత వారం రోజుల నుండి గ్రామీణ ప్రాంతాలలో రెండున్నర సంవత్సరాల కాలంలో ప్రభుత్వం సాధించిన ప్రగతి నివేదికను అంశాలవారీగా వివరించారు. అదే అంశంపై మండల స్థాయిలో కూడా ఈ సభ నిర్వహించారు ప్రజలకు రేషన్ కార్డులు ఉచిత విద్యుత్తు రైతు భరోసా వరి ధాన్య సేకరణ రబ్బీలో ఇందిరమ్మ ఇండ్లు స్వయం సహాయక సంఘాల అభివృద్ధి చేయూత పెన్షన్లు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై చర్చ ఉచిత చీరల పంపిణీ తదితర అంశాలపై అధికారులు తెలియజేశారు ఇందులో సభకు హాజరైన బొల్లారం సర్పంచ్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో ఏర్పడ్డ తర్వాత ప్రజా పాలన వ్యవస్థను మెరుగుపరచడం జరిగిందని అందులో భాగంగానే ప్రజలకు మహిళలకు ఉచిత బస్సులు కానివ్వండి గృహ జ్యోతి పథకం ద్వారా విద్యుత్తు బిల్లులు ప్రభుత్వమే భరించడం లాంటి ఆరు గ్యారెంటీ ల పథకాలను అమలు చేయడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. ఆయనతోపాటు తూముకుంట సర్పంచ్ రామన్ గౌడు మాట్లాడుతూ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు కట్టుకోవాలని చెపుతుంది. కలెక్టర్ మాత్రం ఇసుకకు తూముకుంట వాగు నుండి అనుమతి ఇవ్వడం లేదని ఆయన అన్నారు ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకురావడం జరుగుతుందని అధికారులు తెలిపారు ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందని ఎంఈఓ తెలిపారు. ఇంకా ఈ సమావేశంలో గోపాల్దిన్నె సర్పంచ్ దొడ్ల కవిత రైతు సంఘం నాయకులు దొడ్ల బాలరెడ్డి మాట్లాడారు సభకు వివిధ గ్రామాల నుండి అధికారులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్చార్జి అధికారి, ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసిల్దార్ ఖాజా మైనుద్దీన్, ఈజీయేసు విద్యాధికారులు, పాల్గొనక ఈ సమావేశానికి సర్పంచులు సర్పంచ్ మీసాల పార్వతమ్మ, సంగినేని పల్లి సర్పంచ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చుదాం : డిఆర్డిఏ పీడి




మండల సభలో మాట్లాడుతున్న డిఆర్డిఏ పిడి నరసింహులు

**చిన్నచింతకుంట, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు ప్రభుత్వ అధికారులు అంకితభావంతో పని చేయాలని డిఆర్డిఏ పిడి నరసింహులు తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులు కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన మండల సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి, గృహ జ్యోతి, సన్నరకం వరికి బోనస్, చేయూత పెన్షన్లు, మహిళా శక్తి బ్యాంకు లీకేజీ, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, కొత్త రేషన్‌కార్డులు, ప్రభుత్వ పాఠశాలలో అల్పాహార పథకం, కుటుంబ జీవితబీమా, ఇంటర్మీడియట్ వరకు మధ్యాహ్న భోజనం, వికలాంగ విద్యార్థులకు వాహనాలు, పంటలమార్పిడి, సేంద్రియ వ్యవసాయం తదితరపథకాలపై ఆయాశాఖల మండలస్థాయి అధికారులు ప్రజలకు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆ దిశగా ప్రభుత్వ అధికారులు, గ్రామ సర్పంచులు సమన్వయంతో పనిచేయాలని డిఆర్డిఏ పిడి తెలిపారు. ప్రజల సహకారంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమని, ప్రభుత్వ పథకాలు ప్రజల వివరించాలని ఆయన సూచించారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, రోడ్డు భద్రత ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ కథలప్ప, తహసిల్దార్ ఎల్లన్న, ఎంపీడీవో లక్ష్మీ నరసింహులు, ఎంఈఓ మురళీకృష్ణ, ఏవో రాజేష్ ఖన్నా, ఏపీవో నవీన్ కుమార్, ఏపిఎం నాగమణి, ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడి సూపర్‌వైజర్, అంగన్‌వాడి కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు, వార్డు సభ్యులు ప్రజలు పాల్గొన్నారు.

## ఇంజన్లో మంటలు చెలరేగి దగ్ధమైన లారీ



మంటల్లో తగలబడుతున్న ధాన్యపు లారీ

**ఎర్రవల్లి ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** లారీ ఇంజన్లో మంటలు చెలరేగి లారీ దగ్ధమైన సంఘటన గురువారం ఎర్రవల్లి మండల పరిధిలోని జింకలపల్లి స్టేజి సమీపంలో జరిగింది. వివరాల్లోకి వెళితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల జిల్లా వెలుగోడు మండలానికి చెందిన ఏపీ 39 యు డి 7399 నెంబర్ గల లారీ వడ్ల ధాన్యంతో తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడ కు బయలుదేరింది. మార్గమధ్యంలో జాతీయ రహదారి ఎన్ హెచ్ 44 పై ఎర్రవల్లి మండలం జింకలపల్లి స్టేజి సమీపం చేరుకోగానే ఒక్కసారిగా లారీ ఇంజన్లో మంటలు చెలరేగగా డ్రైవర్ అప్రమత్తమై లారీని పక్కకు ఆపడంతో త్రుటిలో తప్పిన ప్రమాదం ఈ ఘటనను గమనించిన స్థానికులు వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది సకాలంలో సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. లారీలో ఉన్న ఎక్కువ భాగం ధాన్యం రక్షించగలిగారు. అల్లంపూర్ సిఐ ప్రదీప్ కుమార్ తన సిబ్బందితో కలిసి సహాయక చర్యలను పర్యవేక్షించారు. రహదారిపై ట్రాఫిక్ అంతరాయం కలగకుండా విధులు నిర్వర్తించారు.

## నేడు జాతీయ ఎస్.టి. కమిషన్ సభ్యుడు జాతోతు హుస్సేన్ రాక

**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాతోతు హుస్సేన్ శుక్రవారం మహబూబ్ నగర్ జిల్లా పర్యటనకు రానున్నారు. జిల్లా పర్యటనలో భాగంగా మహబూబ్ నగర్ రూరల్ మండలం లాల్య నాయక్ తండా, రామ్ నాయక్ తండా, హన్వాడ మండలం గిరిజన గ్రామాలలో పర్యటన ఉంటుందని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి యం.చత్రు నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. పర్యటన అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా కలెక్టర్, ఎస్పీ, వివిధ శాఖ జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారని ఆయన ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఉప్పునుంతలలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించాలి

**ఉప్పునుంతల సర్పంచు చింత గాళ్ళ శ్రీనివాసులు**

**ఉప్పునుంతల, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉప్పునుంతలలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని త్వరగా ప్రారంభించాలని గ్రామ సర్పంచు చింత గాళ్ళ శ్రీనివాసులు కోరారు. నియోజకవర్గంలోనే అత్యధికంగా మొక్కజొన్న పంట సాగు చేసుకున్న మండలం కావడంతో టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ ప్రత్యేక చొరవ తీసుకొని మార్క్ ఫెడ్ వారి సౌజన్యంతో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని సర్పంచ్ కోరారు. మండల కేంద్రమైన ఉప్పునుంతలలో 4,5 సంవత్సరాల సరిపడు వాడిన రైతులు అప్పుల ఊబిలో కూరుకు పోయారని వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**మండల అధ్యక్షుడు ఆనంద్ గౌడ్**



వరి కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

**మాగనూర్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష ్యమని మాగనూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆనంద్ గౌడ్ అన్నారు. గురువారం మంత్రి ఆదేశాల మేరకు మాగనూర్ పిఏసిఎస్ కార్యాలయం దగ్గర వరి కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. రైతులకు ప్రభుత్వం ఇస్తున్న గిట్టుబాటు ధరను సద్వినియోగం చేసుకోవాలని ఆయన రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో మాగనూర్ మండల సిఏసిఎస్ స్పెషలాఫీసర్ రఫీదిన్, సిఇఓ గోవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నరసింహారెడ్డి, శివరాంరెడ్డి, మందిపాల్ సర్పంచ్ రఘు, వర్కర్ సర్పంచ్ లక్ష్మప్ప, మాజీ వైస్ ఎంపీపీ తిప్పయ్య, మండల తహసిల్దార్ పుష్పలత, ఏవో సుదర్శన్ గౌడ్, సర్పంచ్ రవీందర్, ఉప సర్పంచ్ రవిచ శంకర్, పిఏసిఎస్ సిబ్బంది ఆంజనేయులు, వెంకటేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణ ఉద్యమమే అరైవ్ అలైవ్ : ఎస్ఐ వెంకటేశ్వర్ గౌడ్

**లింగాల, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదాల నివారణ ఉద్యమమే అరైవ్ ఆలైవ్ అని లింగాల ఎస్ఐ వెంకటేశ్వర్ గౌడ్ అన్నారు. గురువారం లింగాల బస్టాండ్ ప్రాంగణంలో రోడ్డు ప్రమాదాన్ని వారించడానికి చేపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. లైసెన్స్ వాహన పత్రాలు లేకుండా వాహనాలు నడపకూడదన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనం నడపాలన్నారు. మద్యం సేవించి, ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపితే ప్రమాదాలు చోటు చేసుకుంటాయన్నారు , అనంతరం ప్రధాన సెంటర్లో వచ్చి పోయే వాహన పత్రాలను తనిఖీ చేసి వారికి రోడ్డు భద్రత గురించి అవగాహన కల్పించారు. అదేవిధంగా విద్యార్థులు, ప్రజలు, వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు.

## గ్రామంలో నీటి ఎద్దడి నివారణకు కృషి

**- సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్**

**వెల్దండ, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** వేసవి కాలం దృష్ట్యా గ్రామంలో నీటి ఎద్దడి లేకుండా ప్రజలందరికీ తాగునీరు అందిస్తామని సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ అన్నారు. 5వ వార్డులో నూతన బోరు మోటర్‌ను గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బన్నమోని శ్రీను, శ్రీనివాస్ ముదిరాజ్, వార్డు సభ్యులు రేవల్లి, మానస రాజు, కిష్టల్, బొక్కల శ్రీనివాస్, అన్నెపు కృష్ణ, గ్రామ పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి




సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

**వెల్దండ, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి విజయ శ్రీ అన్నారు. వెల్దండ మండల కేంద్రంలోని రైతు వేధిక భవనంలో గురువారం 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మండల స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి మండల ప్రత్యేక అధికారి విజయ శ్రీ, తహసిల్దార్ కార్తీక్ కుమార్, ఎంపీడీఓ కృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలు, రాబోయే రోజుల్లో అమలు చేయబోయే కొత్త పథకాల గురించి అధికారులు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

